ఏబీతండాలో లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ ఇస్తున్న కడియం కావ్య

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

జఫర్‌గఢ్, జనవరి 26 : అర్హులందరికీ సంక్షేమ పథకాల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తున్నదని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. ఆదివారం మండలంలోని ఆళ్వార్‌బండతండాలో సంక్షేమ పథకాలకు సంబంధించిన ప్రొసీడింగ్స్‌ను లబ్ధిదారులకు ఆమె అందజేశారు. ఆర్డీవో డీఎస్ వెంకన్న అధ్యక్షత వహించగా కడియం కావ్య మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ మేరకు సంక్షేమ పథకాలను అందిస్తున్నామన్నారు. ఆర్టీసీ బస్సుల్లో మహిళలు ఉచిత ప్రయాణం, రైతులకు రూ.2 లక్షల పంట రుణాల మాఫీ, 55 వేల ప్రభుత్వ ఉద్యోగాలు భర్తీ చేసినట్లు ఆమె తెలిపారు. అనంతరం 58 మందికి రేషన్ కార్డులు, 65 మందికి ఇందిరమ్మ ఇండ్లు, 192 మందికి రైతుభరోసా, ముగ్గురికి ఇందిరమ్మ ఆత్మీయ భరోసా ప్రొసీడింగ్ కాపీలను ఆమె పంపిణీ చేశారు. అర్హులు ఇంకా ఉంటే మళ్లీ దరఖాస్తు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ తీగల కర్ణాకర్‌రావు, మార్కెట్ వైస్ చైర్మన్ నూకల ఐలయ్య, మండల ప్రత్యేకాధికారి రాధాకిషన్, తహసీల్దార్ శంకరయ్య, ఎంపీడీవో సుమన్, ఏవో కర్ణాకర్‌రెడ్డి, ఆర్ఐ అనిల్‌బాబు పాల్గొన్నారు.

అవార్డు అందుకుంటున్న పీడీ శ్రీనివాస్

ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయుడిగా శ్రీనివాస్

స్టేషన్ ఘన్‌పూర్, జనవరి 26 : డివిజన్ కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వర్తిస్తున్న గుంటి శ్రీనివాస్ ఉత్తమ వ్యాయామ ఉపాధ్యాయుడిగా అవార్డు అందుకున్నారు. గణతంత్ర దినోత్సవ సందర్భంగా ఆదివారం హైదరాబాద్‌లోని ప్రధాన కార్యాలయంలో జరిగిన వేడుకల్లో గురుకుల విద్యాలయాల కార్యదర్శి అల్లువర్షిణి చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌ను కళాశాల ప్రిన్సిపాల్ కృతమూర్తి, డీసీవో పీ శ్రీనివాస్, జోనల్ ఆఫీసర్ విద్యారాణి అభినందించారు.

సామాజిక సేవలో ఆర్యవైశ్య సంఘం

జఫర్‌గఢ్, జనవరి 26 : ఆర్యవైశ్య సంఘ నేతృత్వంలో సామాజిక సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తున్నట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు ప్రమోద్‌కుమార్ అన్నారు. మండల నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం ఆదివారం మండల కేంద్రంలో నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడిగా ఎన్నికైన అంచూరి యుగేందర్, కార్యదర్శి దాంశెట్టి సోమేశ్వర్, కోశాధికారి ఇమ్మడి అశోక్, మహిళా విభాగం అధ్యక్షురాలు అంచూరి కమల, కార్యదర్శి దొడ్డ శ్రావ్య, కోశాధికారి దొడ్డ ఉమారాణితో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం బాధ్యులు చిట్టిమిళ్ల కృష్ణమూర్తి, గందె సీతారాములు, పాలకుర్తి రాజన్న, బోనగిరి శ్రవన్ కుమార్, గన్ను నర్సింహులు, జొన్నల రాజేశ్వర్, బిక్షపతి, సోమన్న, వరూధిని, అనూజ, స్రవంతి పాల్గొన్నారు.

లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేత

అర్హులకు అందకుంటే మళ్లీ దరఖాస్తు చేయాలని అధికారుల వెల్లడి

నర్మెట/బచ్చన్నపేట/దేవరుప్పుల/జనవరి 26: నర్మె మండలంలోని బొమ్మకూర్‌లో వివిధ సంక్షేమ పథకాలకు ఎంపిక చేసి లబ్ధిదారులకు ఆదివారం సంబంధిత అధికారులు మంజూరు పత్రాలను అందించారు. తహసీల్దార్ కేవీ రామానుజాచారి, ఎంపీడీవో అరవింద్ మాట్లాడుతూ అర్హులకు ఎవరికైనా పథకాలు అందకుంటే మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఇందిరమ్మ ఆత్మీయ భరోసాకు 63 మంది, రేషన్‌కార్డులు 86 మందికి, ఇందిరమ్మ ఇండ్లు 101 మందికి, రైతుభరోసా 473 మందికి మంజూరైనట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఈజీఎస్ ఏపీవో రమాదేవి, సీనియర్ అసిస్టెంట్ యాదగిరి పాల్గొన్నారు. బచ్చన్నపేట మండలం సాల్వాపూర్‌లో లబ్ధిదారులకు జిల్లా వ్యవసాయాధికారి, మండల ప్రత్యేకాధికారి రామారావునాయక్ మంజూరు పత్రాలు అందించారు. 64 మందికి ఇందిరమ్మ ఇండ్లు, 52 మందికి ఆత్మీయ భరోసా, 96 మందికి రేషన్‌కార్డులు, రైతుభరోసాలో 811 మందిని ఎంపిక చేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో మల్లికార్జున్, తహసీల్దార్ ప్రకాశ్‌రావు, ఏవో విద్యాకర్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి, గ్రామ పంచాయత సిబ్బంది, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నూకల బాల్‌రెడ్డి, మాజీ సర్పంచ్ బండకింది హరిబాబుగౌడ్, వెంకటేశ్, శింగరయ్య పాల్గొన్నారు. దేవరుప్పుల మండలంలోని లకావత్ తండాలో మండల ప్రత్యేకాధికారి శ్రీధర్‌రావు, తహసీల్దార్ మహిపాల్‌రెడ్డి, ఎంపీడీవో లక్ష్మీనారాయణ నేతృత్వంలో 56 మందికి రేషన్‌కార్డులు, 53 మందికి ఇందిరమ్మ ఇండ్లు, 11 మందికి ఆత్మీయభరోసా పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ లచ్చా నాయక్, ఎంపీవో సురేశ్‌కుమార్, మండల వ్యవసాయాధికారి దివ్య, ఏపీవో కమ్మగాని శ్రీనివాస్ పాల్గొన్నారు.

సాల్వాపూర్, లకావత్ తండాలోని గ్రామసభల్లో లబ్ధిదారులకు మంజూరు పత్రాలు ఇస్తున్న అధికారులు

హామీల అమలుకు ప్రభుత్వం కృషి : ఎమ్మెల్యే

పాలకుర్తి/కొడకండ్ల/చిల్పూరు, జనవరి 26: ప్రజలకు ఇచ్చిన హామీల అమలుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డి అన్నారు. ఆదివారం పాలకుర్తి మండలం తీగారం, కొడకండ్ల మండలం నీలిబండ తండాలో సంక్షేమ పథకాల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు ఆమె అందజేశారు. యశస్వినీరెడ్డి మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా అర్హులను లబ్ధిదారులను ఎంపిక చేస్తామన్నారు. అనర్హులకు అధికారులు లబ్ధి చేకూరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. డీఆర్‌డీవో ఎన్ వసంత, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ హనుమానాయక్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో ఆవుల రాములు, ఎంపీవో రవీందర్, ఏపీవో మంజుల, పాలకుర్తి, తొర్రూరు మార్కెట్ కమిటీ చైర్మన్లు లావుడ్యా మంజుల, హనుమండ్ల తిరుపతిరెడ్డి, బ్లాక్, మండల కాంగ్రెస్ అధ్యక్షులు రాపాక సత్యనారాయణ, గిరగాని కుమారస్వామి, ఎర్రబెల్లి రాఘవరావు, పోగు శ్రీనివాస్, బైకాని ఐలేశ్, జలగం కుమార్, బేతి కుమార్, సలేంద్ర శ్రీనివాస్ పాల్గొన్నారు. చిల్పూరు మండలంలోని గార్లగడ్డతండాలో వివిధ సంక్షేమ పథకాల్లో ఎంపిక చేసిన లబ్ధిదారులకు మంజూరు పత్రాలను చిల్పూరు దేవస్థాన చైర్మన్ పొట్లపల్లి శ్రీధర్‌రావు, స్టేషన్‌ఘన్‌పూర్ వ్యసాయ మార్కెట్ చైర్మన్ లావణ్య, మండల స్పెషల్ ఆఫీసర్ మాధవీలత అందజేశారు. ఈ సందర్భంగా శ్రీధర్‌రావు మాట్లాడుతూ 29 మందికి ఇందిరమ్మ ఇండ్లు, ముగ్గురికి ఆత్మీయ భరోసా, 30 మందికి రేషన్ కార్డులు, 130 మందికి రైతుభరోసాలో రూ.32 లక్షలు అందించామని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సరస్వతి, ఎంపీడీవో శంకర్‌నాయక్, డీటీ రామారావు, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఎంఆర్ఐ వీనిత్, ఎంపీవో మధుసూదనాచారి, ఏవో నజీరుద్దీన్, ఏఈవోలు వీనయ్‌కుమార్, నరిసింహులు, పంచాయతీ కార్యదర్శి రంగారెడ్డి పాల్గొన్నారు.

పాలకుర్తి మండలం తీగారంలో లబ్ధిదారులకు ప్రొసీడింగ్స్ ఇస్తున్న ఎమ్మెల్యే యశస్వినీరెడ్డి

కొత్తపల్లిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి

పారదర్శక పాలన అందించడమే ధ్యేయం

లింగాలఘనపురం, జనవరి 26 : ప్రజలకు పారదర్శకమైన పాలన అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. ఆదివారం మండలంలోని కొత్తపల్లిలో నిర్వహించిన గ్రామసభలో మాట్లాడారు. రైతుభరోసాలో 550 మంది రైతులకు రూ.6 వేల చొప్పున, 17 మందికి రేషన్ కార్డులు, 69 మందికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తూ పత్రాలను అందించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్, ఎంపీడీవో జలంధర్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి, ఏఎంసీ శంకరయ్య, ఏవో వెంకటేశ్వర్లు, నాయకులు ఆంజనేయులు, ఉపేందర్, బొల్లంపల్లి నాగేందర్, శ్రీలతారెడ్డి, దూసర గణపతి, కీసర దిలీప్ రెడ్డి, గుగ్గిల్ల నర్సయ్య, ఏలేమూర్తి, తాటిపాముల రమేశ్ పాల్గొన్నారు.

స్టేషన్ ఘన్‌పూర్‌లో..

స్టేషన్ ఘన్‌పూర్ : సంక్షేమ పథకాలకు సంబంధించిన మంజూరు పత్రాలను ఆదివారం మండలంలోని తానేదార్‌పల్లిలో లబ్ధిదారులకు ఎమ్మెల్యే కడియం శ్రీహరి అందించారు. 754 మందికి రైతుభరోసా, 31 మందికి ఆత్మీయ భరోసా, 151 మందికి రేషన్ కార్డులు, 119 మందికి ఇందిరమ్మ ఇండ్ల పత్రాలను అందించారు. కడియం శ్రీహరి మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్, డీపీవో స్వరూపారాణి, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఎంపీడీవో విజయశ్రీ, డిప్యూటీ తహసీల్దార్ సంధ్యారాణి, మండల వ్యవసాయాధికారి చంద్రన్‌కుమార్, ఏపీవో ప్రేమయ్య, ఏఈవో ఈశ్వరి, ఆర్ఐలు సంతోష్, శ్రీకాంత్, ఎంపీవో నర్సింగరావు, నరేందర్ రెడ్డి, బెలిదె వెంకన్న, దుంపల పద్మారెడ్డి పాల్గొన్నారు.

నిరుపేదలకు ఆర్థిక సాయం అందజేత

జనగామ రూరల్, జనవరి 26 : మండలంలోని వడ్లకొండకు చెందిన 30 మంది నిరుపేదలకు ఉసవేరు చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేశారు. ట్రస్టు డైరెక్టర్లు మాట్లాడుతూ యువతకు, మహిళలకు ఉపాధి అందించేలా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు డైరెక్టర్లు రామచంద్రారెడ్డి, రాజిరెడ్డి, రామ్మోహన్ రెడ్డి, కరుణాకర్ రెడ్డి, మాజీ సర్పంచ్ బొల్లం శారద, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందిస్తున్న ట్రస్టు సభ్యులు

విద్యార్థులకు క్రీడా దుస్తుల అందజేత

దేవరుప్పుల, జనవరి 26: మండల కేంద్రంతోపాటు ధర్మాపురంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల విద్యార్థులకు దేవరుప్పులకు చెందిన కారుపోతుల సారంగపాణి క్రీడా దుస్తులను ఆదివారం అందజేశాడు. ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడలను ప్రోత్సహించే క్రమంలో ఔత్సాహిక క్రీడాకారులకు తనవంతు చేయూతనిస్తున్నట్లు ఆయన వివరించారు. ఈ సందర్భంగా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సారంగపాణికి కృతజ్ఞతలు తెలిపి సత్కరించారు.

ఆలింపూర్ పాఠశాలకు ప్రింటర్ బహూకరణ

బచ్చన్నపేట, జనవరి 26 : మండలంలోని అన్ని గ్రామాల్లో గణతంత్ర దినోత్సవ వేడుకలు నిర్వహించి జాతీయ జెండాలను ఎగురవేశారు. ఆలీంపూర్ మాజీ సర్పంచ్ బాల్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ మసూద్ ఆధ్వర్యంలో సంబురాలు నిర్వహించారు. గ్రామానికి చెందిన ఎన్ఆర్ఐ వంగాల శ్రీకాంత్‌రెడ్డి పాఠశాలకు రూ.15 వేల విలువైన ప్రింటర్‌ను హెచ్ఎం స్వర్ణలతకు అందించారు. మాజీ ఎంపీటీసీ మసూద్ పాఠశాల కిటికీలకు రూ.15 వేల విలువైన మెష్ జాలీలు బహూకరించారు.

యాదవ సంఘం నర్మెట మండల కార్యవర్గం

నర్మెట, జనవరి 26: యాదవ సంఘం మండల నూతన కమిటీని ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కన్నెబోయిన గట్టయ్య, ఉపాధ్యక్షుడిగా ముద్దం గట్టయ్య, ప్రధాన కార్యదర్శిగా మారబోయిన కర్ణాకర్, కార్యదర్శిగా కన్నెబోయిన గట్టుమల్లు, సహాయ కార్యదర్శిగా నక్కల బీములు, కోశాధికారులుగా కాసాని ఆంజనేయులు, ఎర్రబోయిన రవికుమార్, సహాదారులుగా కూకట్ల రవి, కొప్పుల గట్టయ్య, తుప్పుడు మహేశ్, పాలసాని రాజు ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా మెడుదుల రాజు, నక్కల రవి, ముక్కెర రాజేశ్‌ను ఎన్నికయ్యారు. తన నియామకానికి సహకరించిన అందరికీ ఈ సందర్భంగా గట్టయ్య కృతజ్ఞతలు తెలిపారు.

కార్యవర్గాన్ని సన్మానిస్తున్న యాదవ సంఘ సభ్యులు

యాదవ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా భాస్కర్

రఘునాథపల్లి : మండలంలోని జాఫర్‌గూడెం గ్రామానికి చెందిన కావటి భాస్కర్ యాదవ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా ఎన్నికైన సందర్భంగా పలువురు సత్కరించారు. ఆదివారం సొసైటీ చైర్మన్ చీమలపాటి రవీందర్‌తో పాటు పలువురు భాస్కర్‌ను కలిసి అభినందించారు. యాదవుల హక్కుల కోసం పోరాడాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ మూడు ధర్మ, అయిత జయరాములు, మహేశ్, ఇల్లందుల రవీందర్, బొల్లపల్లి సౌందర్య, సీఈఓ ప్రశాంత్ పాల్గొన్నారు.

భాస్కర్‌ను సన్మానిస్తున్న చీమలపాటి రవీందర్

విజయ డెయిరీ పార్లర్ ప్రారంభం

దేవరుప్పుల, జనవరి 26: మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ రంగ సంస్థ విజయ పాల డెయిరీ పార్లర్‌ను డెయిరీ జిల్లా చైర్మన్ కాసారపు ధర్మారెడ్డి ఆదివారం ప్రారంభించారు. దీనిని గులాం రసూల్ ఏర్పాటు చేశారు. ధర్మారెడ్డి మాట్లాడుతూ పార్లర్ ద్వారా నాణ్యమైన పాలు, పెరుగు, వెన్న, నెయ్యి, స్వీట్లు అమ్ముతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయ డెయిరీ జనగామ మేనేజర్ హరికృష్ణ, స్టేషన్ ఘన్‌పూర్ మేనేజర్ లింగారెడ్డి, సూపర్‌వైజర్ వెంకట్ రెడ్డి, మహ్మద్ జాకీర్ పాల్గొన్నారు.

విజయడెయిరీ పార్లర్‌ను ప్రారంభిస్తున్న ధర్మారెడ్డి

రాబడి

యూపీఎస్ వచ్చేస్తోంది..

ఏప్రిల్ 1 నుంచి కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు అమలు

కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ (యూపీఎస్) అమలును మోదీ సర్కారు ప్రకటించింది. పదవీ విరమణ పొందినవారికి పింఛన్ హామీ, ఆర్థిక భద్రతలే లక్ష్యంగా పాత పెన్షన్ స్కీమ్ (ఓపీఎస్), జాతీయ పెన్షన్ సిస్టమ్ (ఎన్‌పీఎస్) రెండింటి ప్రయోజనాలను కలగలిపి ఈ యూపీఎస్‌ను కేంద్రం తీసుకొచ్చింది. ఈ ఏడాది ఏప్రిల్ 1 నుంచి ఇది అమల్లోకి రానున్నది. అయితే అర్హులైనవారికి ఈ యూపీఎస్ ఎలాంటి పరిస్థితుల్లో వర్తిస్తుందో కూడా ఇందులో పేర్కొన్నారు.

పదవీ విరమణ

కనీసం పదేండ్లు ఎంపిక చేసిన సేవలు అందించి, ఆ తర్వాత రిటైరైన ఉద్యోగులకు యూపీఎస్ వర్తిస్తుంది.

ఎఫ్ఆర్ 56(జే) కింద రిటైర్మెంట్

పెనాల్టీ ప్రొవిజన్స్ కింద కాకుండా రిటైరైన ప్రభుత్వ ఉద్యోగులే అర్హులు.

వాలంటరీ రిటైర్మెంట్

కనీసం 25 ఏండ్లు పనిచేసి, ఆ తర్వాత స్వచ్ఛంద పదవీ విరమణ తీసుకున్నవారికి రిటైర్మెంట్ వయసు వచ్చాకే పింఛన్.

ఇలాగైతే రాదు..

డిస్మిస్, ఉద్యోగం నుంచి తొలగించిన వారు, రాజీనామా చేసినవారికి యూపీఎస్‌ను ఎంచుకొనే అవకాశం ఉండదు.

యూపీఎస్ ప్రయోజనాలు

- 25 ఏండ్లు లేదా అంతకుమించి క్వాలిఫైయింగ్ సర్వీస్ ఉన్న ఉద్యోగులకు రిటైర్మెంట్‌కు ముందు చివరి 12 నెలలు అందుకున్న వేతనంలోని సగటు బేసిక్ పేలో 50 శాతాన్ని నెల నెలా పింఛన్‌గా అందిస్తారు. సర్వీస్ 25 ఏండ్ల కంటే తక్కువగా ఉంటే పింఛన్ తగ్గుతుంది.
- క్వాలిఫైయింగ్ సర్వీస్‌లో 10 ఏండ్లు, అంతకుమించి ఉన్న ఉద్యోగులకు నెలకు కనీసం రూ.10,000 పింఛన్‌గా చెల్లిస్తారు. 25 ఏండ్లు పనిచేసి వాలంటరీ రిటైర్మెంట్ తీసుకున్నవారికి, పదవీ విరమణ వయసు వచ్చాకే పింఛన్ మొదలవుతుంది.
- పదవీ విరమణ అనంతరం పింఛన్‌దారుడు చనిపోతే.. ఆ పింఛన్‌లో 60 శాతం భార్య లేదా భర్తకి వస్తుంది.
- నిబంధనలకు లోబడి ఉద్యోగులకు డీఏ తరహాలోనే పింఛన్‌దారుడు, వారు లేకపోతే భాగస్వామికి డియర్‌నెస్ రిలీఫ్‌నూ చెల్లిస్తారు. పింఛన్ మొదలైతేనే వస్తుంది.
- అదనంగా పదవీ విరమణ సమయంలో క్వాలిఫైయింగ్ సర్వీస్‌లోని ప్రతీ ఆరు నెలల కాలానికి నెలవారీ బేసిక్ పే, డీఏలో 10 శాతం చొప్పున లెక్కించి ఎన్నేండ్లయితే అన్నేండ్లకు ఒకేసారి చెల్లిస్తారు. ఈ మొత్తం పింఛన్‌లో తగ్గించరు.

ఇలా ట్రై చేద్దామా..!

లో క్యారెట్ గోల్డ్‌కూ డిమాండే

దేశీయంగా బంగారం ధరలు మళ్లీ ఆల్‌టైమ్ హైల్లో కదలాడుతున్నాయి. మొన్నటిదాకా తగ్గుముఖం పడుతున్నట్టు కనిపించినా.. తిరిగి పుంజుకున్నాయి. దీంతో చాలా మంది అవసరమైతే తప్ప పసిడి కొనుగోళ్లకు వెళ్లడం లేదు. ఇంకొందరైతే రేట్లు మరింత తగ్గుతాయేమోనని ఎదురుచూస్తూ ఉన్నారు. బహిరంగ మార్కెట్‌లో 24 క్యారెట్ గోల్డ్ 10 గ్రాముల విలువ మునుపెన్నడూ లేనివిధంగా రూ.83,000 దాటేసింది మరి. అయితే సరిగ్గా ఇప్పుడే లో క్యారెట్ గోల్డ్.. కొనుగోలుదారులకు చక్కని ప్రత్యామ్నాయంగా కనిపిస్తున్నది. 24 క్యారెట్ (99.9 స్వచ్ఛత), 22 క్యారెట్ (99.5 స్వచ్ఛత)లే కాకుండా 18, 14, 10 క్యారెట్ బంగారు ఆభరణాలు కూడా దొరుకుతాయి. నిజానికి ఇప్పుడిప్పుడే ఈ లో క్యారెట్ గోల్డ్‌కూ డిమాండ్ కనిపిస్తుండటం మార్కెట్‌లో మారిన ట్రెండ్‌కు నిదర్శనం.

బడ్జెట్‌కు తగ్గట్టుగా..

కొనుగోలుదారుల అభిరుచికి తగ్గట్టుగా ఇటీవలికాలంలో బడా జ్యుయెల్లర్స్, ప్రముఖ నగల వర్తకులు సైతం 18 క్యారెట్ బంగారు ఆభరణాలను పెద్ద ఎత్తున తయారు చేస్తున్నారు. మరికొన్ని చిన్నచిన్న జ్యుయెల్లర్స్ 14, 10 క్యారెట్ బంగారు నగలనూ తెస్తున్నారు. పైగా భారతీయ మార్కెట్‌లో మెజారిటీ వాటా మిడిల్ క్లాస్ కస్టమర్లదే కావడంతో జ్యుయెల్లర్స్ దృష్టీ ఈ లో క్యారెట్ విభాగంపై గట్టిగానే పడుతున్నది. ఇక వీటిలోనూ నచ్చిన, రకరకాల డిజైన్లు ఇప్పుడు లభిస్తుండటం విశేషం. దీంతో ఎగువ మధ్యతరగతి నుంచి దిగువ మధ్యతరగతి వర్గాలదాకా అంతా వీటి కొనుగోళ్లకు ఆసక్తి చూపిస్తున్నారు. ముఖ్యంగా యువత కూడా మక్కువ చూపుతున్నది. అలాగే ధర తక్కువ కావడం, ఆకర్షణీయంగా కూడా ఉండటంతో మార్కెట్‌లో వీటికి నానాటికీ డిమాండ్ పెరుగుతూపోతున్నది. అందరి బడ్జెట్‌కు తగ్గట్టుగా అందుబాటులో ఉంటుండటంతో పెండ్లిళ్లు, ఇతర శుభకార్యాలకూ ఎక్కువగా వీటినే ఎంచుకుంటుండటం ఈ మధ్యకాలంలో పెరిగిందనే చెప్పవచ్చు.

నాణ్యతకు ఢోకా లేదు

22 క్యారెట్ నుంచి 10 క్యారెట్ వరకు ఆయా ఆభరణాల్లో బంగారం వినియోగం తగ్గుతున్నకొద్దీ వెండి, రాగి, జింక్, నికెల్, పల్లాడియం తదితర లోహాల వాటా పెరుగుతుంది. అందుకే వాటి ధరల్లో అంత తేడా. 22 క్యారెట్ బంగారు ఆభరణాల్లో బంగారం వాటా ఎక్కువగా ఉంటుంది కనుక సహజంగా వీటి రేటు అధికం. 24 క్యారెట్ గోల్డ్ రేటుకు దగ్గర్లోనే పలుకుతుంది. నిజానికి స్వచ్ఛమైన బంగారంతో నగలను తయారు చేయలేం. అందుకే వాటిలో ఇతర లోహాలను కొద్దిగానైనా కలుపుతారు. ఇదే క్రమంలో గోల్డ్ క్యారెట్ తగ్గుతున్నకొద్దీ ఇతర లోహాల పరిమాణం పెరుగుతూపోతుంది. అంతమాత్రం చేత నాణ్యతకు ఢోకా ఉండదు. ఇంకా చెప్పాలంటే 22 క్యారెట్ కంటే 18 క్యారెట్ బంగారు ఆభరణాలే గట్టిగా ఉన్నాయని వినియోగదారులు చెప్తుండటం గమనార్హం.

చివరగా..

ధరలు పెరిగాయనో.. డబ్బు సరిపడా లేదనో కాకుండా మీ బడ్జెట్‌లో ఆయా రకాల లో క్యారెట్ నగలను ఆనందంగా కొనేయండి. అయితే మోసాలకు తావు లేకుండా జాగ్రత్తపడటం మాత్రం మరిచిపోవద్దు. అన్ని నాణ్యతా ప్రమాణాలు ఉన్నాయా? లేదా? అన్నది కనుక్కోవడం మంచిది. ఇక వీటిని మళ్లీ అమ్ముకున్నా.. తరుగుపోను అందులోని బంగారానికి అప్పటి రేటు ఎలాగూ లభిస్తుంది. ధర తక్కువైతే అప్పుడు మరింత హై క్యారెట్ బంగారు నగలకు అప్‌గ్రేడ్ అయిపోండి.



రెండేండ్ల క్రితం దేశీయంగా నగల అమ్మకాల్లో 5 నుంచి 7 శాతంగా ఉన్న లో క్యారెట్ గోల్డ్ ఆర్నమెంట్స్ వాటా.. ఇప్పుడు 15% దాటిపోవడం మారిన ట్రెండ్‌కు అద్దం పడుతున్నది.

-సురేంద్ర మెహెతా, భారతీయ బులియన్, జ్యుయెల్లర్స్ సంఘం కార్యదర్శి

తేలికపాటి నగల హవా

ఒకప్పుడు నడుములు వంగిపోయేంతదాకా నగలు ధరించేవారు. భారీ డిజైన్లతో.. తులాలకొద్దీ బంగారాన్ని పెట్టుకునేవారు. కానీ ఇప్పుడు అంతంత బరువైన నగలను వేసుకొనేందుకు సంపన్నులు సైతం ఇష్టపడటం లేదు. దీంతో మార్కెట్‌లో తేలికపాటి బంగారు నగలకే ప్రస్తుతం ఎక్కువగా డిమాండ్ ఉంటున్నదని నగల వ్యాపారులు అంటున్నారు. నగల తయారీలో వచ్చిన కొత్త టెక్నాలజీ.. సంప్రదాయ, భారీ డిజైన్లనూ తక్కువ బంగారాన్ని వినియోగించి స్వల్ప బరువుకే అందుబాటులోకి తెచ్చేలా చేసిందని ప్రపంచ స్వర్ణ మండలి భారతీయ కార్యకలాపాల విభాగం సీఈవో సచిన్ జైన్ చెప్పున్నారు. మొత్తానికి లైట్ వెయిట్.. లో క్యారెట్ గోల్డ్ ఇప్పుడు పసిడి మార్కెట్‌ను శాసిస్తున్నాయనడంలో సందేహం లేదు.

ఇదీ క్యారెట్ కథ..

- **24 క్యారెట్‌లో 99.90 శాతం స్వచ్ఛమైన పుత్తడి ఉంటుంది. దీన్నే మేలిమి బంగారంగా కూడా పిలుస్తారు. కడ్డీలు, బిస్కట్లు, నాణేల రూపంలో అమ్ముతారు.**
- **22 క్యారెట్‌లో 91.67 శాతం స్వచ్ఛత కలిగిన పసిడి లభిస్తుంది. మిగతా 8.33 శాతం (5 శాతం వెండి, 2 శాతం రాగి, 1.33 శాతం జింక్) ఇతర లోహాల మిశ్రమం ఉంటుంది. అత్యుత్తమ శ్రేణి నగల తయారీకి దీన్నే వాడుతారు.**
- **18 క్యారెట్‌లో 75 శాతం ప్యూర్ గోల్డ్ కనిపిస్తుంది. 25 శాతం ఇతర లోహాలే.**
- **14 క్యారెట్‌లో 58.33 శాతం స్వచ్ఛమైన బంగారం. 41.67 శాతం వేర్వేరు లోహాలను కలుపుతారు.**
- **10 క్యారెట్‌లో 41.67 శాతం బంగారం, 58.33 శాతం ఇతర లోహాలు.**

సూచీలకు బడ్జెటే దిక్సూచి

దేశీయ స్టాక్ మార్కెట్లు రివర్స్‌గేర్‌లోనే నడుస్తున్నాయి. గత వారంలోనూ నిరాశపర్చాయి. ఇన్వెస్టర్లు అమ్మకాల ఒత్తిడిలో ఉండిపోతున్నారు. ఈ క్రమంలోనే అంతకుముందు వారం ముగింపుతో చూస్తే గత వారం బాంబే స్టాక్ ఎక్స్చేంజ్ (బీఎస్ఈ) ప్రధాన సూచీ సెన్సెక్స్ 428.87 పాయింట్లు లేదా 0.55 శాతం దిగజారి 76,190.46 వద్ద స్థిరపడింది. నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్ఎస్ఈ) సూచీ నిఫ్టీ 111 పాయింట్లు లేదా 0.47 శాతం క్షీణించి 23,092.20 దగ్గర ఆగింది. అయితే ఈ వారం బడ్జెట్ అంచనాలు, నిర్ణయాలు.. మార్కెట్లకు దిక్సూచిగా ఉండనున్నాయి. వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2025-26)గాను ఫిబ్రవరి 1న పార్లమెంట్‌లో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ కొత్త బడ్జెట్‌ను ప్రవేశపెట్టబోతున్నారు. ఇది శనివారమైనప్పటికీ స్టాక్ మార్కెట్లలో ట్రేడింగ్ జరుగనున్నది. సాధారణంగా శని, ఆదివారాలు స్టాక్ మార్కెట్లకు సెలవు అన్న విషయం తెలిసిందే. దీంతో బడ్జెట్‌ను ఇన్వెస్టర్లు మెచ్చితే సూచీలు పైకి, లేకుంటే కిందికి అనుకోవచ్చు. ప్రధానంగా ఆయా రంగాల షేర్లను పన్నులు, ప్రోత్సాహకాలు నడిపిస్తాయని చెప్పవచ్చు. ఆదాయ పన్నుల్లో ఊరట లభిస్తే ఆటో, రియల్టీ, బ్యాంకింగ్ షేర్లకు ఊతమిచ్చినట్టే. అలాకాకున్నా ఇవే ముందుగా ప్రభావితం కావచ్చు. ఇక డాలర్‌తో పోల్చితే ఇంకా ఆమోదయోగ్యం కాని స్థాయిల్లోనే కొట్టుమిట్టాడుతున్న రూపాయి మారకం విలువ.. మార్కెట్ సెంటిమెంట్‌ను దెబ్బతీస్తున్నది. గ్లోబల్ స్టాక్ మార్కెట్ల తీరుతెన్నులు, విదేశీ మదుపరుల పెట్టుబడులు, ముడి చమురు ధరలు, అంతర్జాతీయ పరిణామాలూ కీలకమే. కాగా, అమ్మకాల ఒత్తిడి కనిపిస్తే నిఫ్టీకి 22,700 పాయింట్ల స్థాయి కీలకమైనదనుకోవచ్చు. దీనికి దిగువన ముగిస్తే 22,500 పాయింట్ల స్థాయిని మద్దతుగా చెప్పుకోవచ్చని అత్యధిక నిపుణుల మాట. అయితే సూచీలు పరుగందుకుంటే ఈ వారం నిఫ్టీ 23,300-23,500 స్థాయికి వెళ్లవచ్చని కూడా చెప్తున్నారు.

మార్కెట్ పల్స్

గమనిక..: స్టాక్ మార్కెట్ పెట్టుబడులు రిస్క్‌తో కూడుకున్నవి. వివిధ దేశ, విదేశీ పరిణామాలు ట్రేడింగ్‌ను ఎక్కువగా ప్రభావితం చేస్తుంటాయి. కాబట్టి ఇక్కడ ఒడిదొడుకులు చాలా సహజం. పెట్టుబడులు పెట్టే ముందు ఆర్థిక నిపుణుల సలహా తీసుకోవడం, ఆయా సాధనాల డాక్యుమెంట్లను క్షుణ్ణంగా చదువుకోవడం ఉత్తమం. అలాగే పైన పేర్కొన్న సూచనలు విశ్లేషకుల అభిప్రాయం మాత్రమే. దీనికి మా పత్రిక ఎటువంటి బాధ్యత వహించదు. ఎవరి పెట్టుబడులకు వారిదే పూర్తి బాధ్యత. అవగాహన కోసమే ఈ మార్కెట్ పల్స్.

తపాలా పథకాలు భళా

గరిష్ఠంగా 8.2 శాతం వడ్డీరేటు

తపాలా శాఖ రకరకాల పెట్టుబడి పథకాలను అందిస్తున్నది. ఫిక్స్‌డ్ డిపాజిట్ (ఎఫ్‌డీ), రికరింగ్ డిపాజిట్ (ఆర్‌డీ), మంత్లీ ఇన్‌కమ్ డిపాజిట్ (ఎంఐడీ), సీనియర్ సిటిజన్ సేవింగ్స్ స్కీమ్ (ఎస్‌సీఎస్ఎస్), సుకన్య సమృద్ధి యోజన (ఎస్ఎస్‌వై), నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్ (ఎన్ఎస్‌సీ), కిసాన్ వికాస్ పత్ర (కేవీపీ), మహిళా సమ్మాన్ సేవింగ్ సర్టిఫికెట్ (ఎంఎస్ఎస్‌సీ) వంటి చిన్న మొత్తాల పొదుపు పథకాల్లో సురక్షిత పెట్టుబడులకు అవకాశం కల్పిస్తున్నది. అంతేగాక వీటికి వడ్డీరేటు 6.7 శాతం నుంచి 8.2 శాతం వరకు ఉన్నది. ఈ పథకాల ద్వారా ఇతర ప్రయోజనాలూ మదుపరులకు అందుతుండటం విశేషం.

పథకం	వడ్డీ (%)
పోస్టాఫీస్ సేవింగ్స్ అకౌంట్	4.00
ఏడాది, రెండేండ్ల ఎఫ్‌డీ	6.9, 7,
మూడు, ఐదేండ్ల ఎఫ్‌డీ	7.1, 7.5
పోస్టాఫీస్ ఆర్‌డీ	6.70
ఎస్‌సీఎస్ఎస్	8.20
పోస్టాఫీస్ మంత్లీ ఇన్‌కమ్	7.40
నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్	7.70
పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్	7.10
కిసాన్ వికాస్ పత్ర	7.50
మహిళా సమ్మాన్	7.50
సుకన్య సమృద్ధి యోజన	8.20